ఆందోళనలో అన్నదాతలు

- ముదురుతున్న నారుమడులు
- కరుణించని వరుణుడు
- ఖరీఫ్ సాగుపై ఆందోళనలో రైతులు
- ప్రాజెక్టులకు రాని వరద జలాలు

ధరూరు : ఖరీఫ్ పంట సాగు ముందుకు సాగడం లేదు. వరుణ దేవుడు కరుణించకపోవడంతో పంట సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇంకా వేసవిని తలపించేలా వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. చదురు ముదురు వర్షాలు మినహా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడం లేదు. వర్షపు నీరు పంట పొలాలను ముంచెత్తేలా చేస్తేనే గాని పంట సాగుకు అనువుగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సారి నష్టమే..

ఏటా ఈ పాటికే సగానికి పైగా పంట సాగు పనులు పూర్తయ్యేవి. సమృద్ధిగా వర్షాలు కురవకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముందస్తుగా సాగుచేసుకున్న పత్తి రైతులు మొన్నటి వరకు చేను ఎర్రబడిపోగా.. నేడు పెప్పొడి రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వరిపంట సాగుకోసం పంట పొలాల్లో సిద్ధం చేసుకున్న నారుమడులు ముదురుతుండడంతో ఏం చేయాలో తోచక రైతులు ఆందోళన పడుతున్నారు.

అంతంత మాత్రమే వర్షాలు..



ధరూరు శివారులో వరి సాగు చేయాల్సిన ప్రదేశాలు బీడుగా ఉన్న వైనం



జాంపల్లి శివారులో ఖరీఫ్ వరి నాటు పనులు



దోర్నాల శివారులో ముదురుతున్న నారుముడులు

నడిగడ్డ ప్రాంతమే కాకుండా అన్ని ప్రాంతాల్లోనూ వర్షాలు తక్కువగానే కురుస్తున్నాయి. జూరాల ప్రాజెక్టు ఎగువ భాగంలోని మహారాష్ట్రలోనూ వర్షాలు అంతంత మాత్రమే కురుస్తుండడంతో ప్రాజెక్టుల నుంచి జూరాలకు వరద నీరు రావడం లేదు. దీంతో నెట్టెంపాడు కింద సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. గత ఏడాది మండలంలోని నెట్టెంపాడు పథకం కింద సాగు ప్రారంభమే కాలేదు. గత ఏడాది ఈ పాటికే 2వేలకు పైగా ఎకరాల్లో పంటసాగు అయ్యింది. ఈ సారి మాత్రం కనీసం.. వంద ఎకరాలు కూడా సాగు కాలేదు. బోరుబావుల కింద ఎకరం, అర ఎకరం పంట సాగుపనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి.

ఆందోళనలో రైతున్నలు..

మండలంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి వరద జలాలు రాకపోవడంతో ఈ ప్రాంత రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. చేతి కష్టం మాటటుంచితే.. కనీసం కౌలు డబ్బులు చెల్లించడం కష్టంగా ఉందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టులకు నీళ్లు రావడం లేదు..



ప్రాజెక్టులకు సాగు నీళ్లు రాలేదు. నెట్టెంపాడు జలాలే ఆధారంగా ఉన్న మాకు ఈ సారి గడ్డు పరిస్థితి కనిపిస్తోంది. పత్తిపంట ఆర్థికంగా దెబ్బకొట్టింది. పెట్టుబడి బాగానే పెట్టాం. కానీ... సుంకు రావడం లేదు. తద్వారా కాయ పట్టడం లేదు. ఏం చేయాలో తోచడం లేదు.

– శ్రీనివాసరావు, రైతు, కోతులగిద్ద, ధరూరు

వర్షాలు రావడం లేదు..



నేను రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తున్నాను. ఈ సారి వర్షాలు కురవకపోవడంతో పత్తి పంట ఎర్రబడింది. నేడు పుప్పొడి రావడం లేదు. వరిపంట సాగుకోసం నారుమడి సిద్ధం చేసుకున్నా. మరోవారం రోజులు గడిస్తే వరి పంట కూడా ప్రశ్నార్థకమే..

– వెంకటన్న, కౌలు రైతు, ధరూరు

ఇబ్బంది లేకుండా చూస్తాం..



ఈ ప్రాంతంలో పంట సాగు కాస్త ఆలస్యమైన విషయం వాస్తవమే. కానీ ఇంకా టైం ఉంది. పీఏసీఎస్ కార్యాలయాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. సాగుకు సంబంధించి తమ శాఖ తరపున సలహాలు, సూచనలు ఇవడంతోపాటు రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– శ్రీలత, మండల ఏఓ, ధరూరు

క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తుల స్వీకరణ

కేటీదొడ్డి: రైతుబీమాకోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి మహలక్ష్మి కోరారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబీమా చేసుకోవడానికి వచ్చే నెల 5 వరకు కొత్తపాస్ పుస్తకాలు వచ్చిన రైతులు స్వయంగా రైతువేదిక వద్దకు వచ్చి రైతుబీమాను చేసుకోవాలని కొత్తపట్టాదారు పాస్‌పుస్తకం 18 జూన్ 2023 లోపు పొంది అర్హత ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతాండ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్ఎం శ్రీరాములు విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మొత్తం 70మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అయిజ: ప్రభుత్వం విధించిన ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని ఎస్సై నరేష్ కుమార్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని ఉప్పలలో షీ టీం, పోలీస్, కళా బృందం గ్రామస్తులకు బాల్యవివాహాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడంతో జరిగే అనర్థాల గురించి వివరించారు. బాధిత మహిళలకు బరోసా కేంద్రం అందిస్తున్న సేవల గురించి తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాదమ్మ, షీటీం కళా బృందం సభ్యులు హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు పకడ్బందీగా నిర్వహించాలి

మానవపాడు: ఓటు నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. గురువారం మండలంలోని చిన్నపోతులపాడు, చెన్నిపాడు గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటరు నమోదన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.

డ్రైనేజీకి మరమ్మతులు



అయిజ: పట్టణంలోని గురువారం డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. మున్సిపాలిటీలోని 18వ వార్డులో బలిజపేట, పెద్ద బోయపేటలలో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పనిచేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ భరత్, ఇన్విరాన్మెంటల్ ఇంజనీర్ సురేష్, బిల్‌కలెక్టర్ అజ్మీర్ ఖాజా, నరేష్, నాగరాజు, మహేంద్ర నాథ్, ఆడివన్న, అంజనేయులు, వీరేష్, రాకేష్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు

అలంపూర్ రూరల్ : అలంపూర్ పట్టణంలో గురువారం ఇంటింటికీ తిరిగి ఇంటి పన్ను, నీటి బిల్లులు వసూలను మున్సిపల్ సిబ్బంది చేశారు. బుధవారం రూ. 32 వేలు గురువారం రూ.16 వేల బిల్లులు వసూలైనట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్‌లు ఆహ్మద్ షరీఫ్, నారాయణ మున్సిపల్ సిబ్బంది రమేష్, ఖయ్యూం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షాట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

మల్దకల్ : షాట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైన సంఘటన మండలంలోని నీలిపల్లె వద్ద గురువారం చోటుచేసుకుంది. నీలిపల్లెకి చెందిన నరేష్‌శెట్టితోపాటుగా సవారన్నగౌడ్, లక్ష్మీ, వెంకటేష్‌లు కారులో మల్దకల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఎద్దులగూడెం సమీపంలో కారులోంచి పొగలు రావడంతో కారును అక్కడే నిలిపి వేశారు. కారులోని బయటకు వచ్చారు. అంతలోపే కారులో మంటలు చెలరేగడంతో మంటలకు కారు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారులోని వారు క్షేమంగా బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. షాట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

పండ్లు, బ్రెడ్ల పంపిణీ

గట్టు : పీహెచ్‌సీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి, బండ్లజ్యోతి జన్మదినం సందర్భంగా గురువారం రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలను పంపిణీ చేశారు. వైద్యంకోసం వచ్చిన వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు బండ్ల జ్యోతికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వీరభద్రప్ప, నవీన్‌చారి, తెలుగు వీరన్న, వెంకటేష్, వడ్డే నర్సింహులు, బోజ్జన్న, ఎండీ అలీ, ఖాజ, తిమ్మప్ప పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం

అలంపూర్ : సీఎం సహాయనిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. స్థానిక చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని 33మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం పంపిణీచేసి మాట్లాడారు. సీఎం సహాయ నిధి పేదవర్గాల ప్రజలకు భరోసాగా నిలిచిందన్నారు. నియోజకవర్గంలోని పేదలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామన్నారు. అదేవిధంగా చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో బీసీ కమ్యూనిటీ భవనం, మైనార్టీ కమ్యూనిటీ భవనం, ఈద్గాహ్ ప్రహరీ గోడల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ప్రొసీడింగ్‌ను అందజేశారు. రాజోలి మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ. 25 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేశారు. అదేవిధంగా అయిజ మున్సిపాలిటీలో మైనార్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ. 45 లక్షలు, ఈద్గాహ్ ప్రహరీగోడ నిర్మాణానికి రూ. 20 లక్షల ప్రొసిడింగ్‌ను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ దేవన్న, నాయకులు రమణ, సుంకన్న, రాజు, నరేందర్, నాగేశ్వర్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం

స్థానిక చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్న జంటకు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం గురువారం రూ.2.50 లక్షల చెక్కును అందజేశారు. అయిజ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గోపాలమ్మభర్తరాజుకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా కులాంతర వివాహం చేసుకున్న జంటకు చెక్కుమంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

చదువుతో ఉన్నతస్థానానికి ఎదగాలి



బస్ పాస్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

ధరూరు : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే బండ్ల పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పేరు, ధరూరు ఉన్నత పాఠశాలల్లో చదివే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో ఉచితపాస్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్‌టీసీ డీఎం శ్రీనివాసు లుతోపాటు డీఈఓ సిరాజుద్దీన్, మండల ప్రజా ప్రతినిధులతో కలిసి విద్యార్థులకు పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు... విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసే లా ఆర్టీసీ అధికారులను కోరినట్లు తెలిపారు. ఎంపీపీ నజీమున్నీసా బేగం, ఎంఈఓ సురేష్, జీహెచ్ఎంలు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పద్మ మ్మ, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు/కేటీదొడ్డి: గట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంపీపీ విజయ్‌కుమార్ ఉచిత బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో ఉచిత బస్‌పాస్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. బస్వరాజు, రాము నాయుడు, బజారి, సంతోష్, వెంకటేష్, వీరారెడ్డి, నవీన్‌చారి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డిలో..

కేటీదొడ్డి మండలం నందిన్నె జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్ ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉరుకుందు, నాయకులు హన్మంతు, చక్రదర్, మిల్లు వీరన్న, రంగారెడ్డి, గోపి, శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించకుంటే ధర్నాలు చేస్తాం

అయిజ: పశువుల సంతలో అధికారులు అధికంగా పెంచిన రుసుము తగ్గించకుంటే రైతుల తరుపున ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్ మైదానంలో గురువారం నిర్వహించిన పశువుల సంతలో విక్రయ రుసుము అధికంగా వసూలు చేస్తున్నారని రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఒక గొర్రెకు రూ. 10, ఆవు లేదా ఎద్దుకు రూ. 50 వసూలు చేసేవారని, గత రెండు వారాలుగా ఒక గొర్రెకు రూ. 50, ఆవు లేదా ఎద్దుకు రూ. 300 వసూలు చేస్తున్నారని వాపోయారు. నిబంధనల మేరకు రుసుము చార్జీలు పెంచామని మార్కెట్ సెక్రటరీ రైతులతో, కాంగ్రెస్ నాయకులతో వాదించారు.

స్వీపర్లను రెగ్యూలరైజ్ చేయాలి

శాంతినగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యూలరైజ్ చేయా లని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని జిల్లా అధ్యక్షుడు రామలింగం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వీపర్ల డిమాండ్ల సాధనకోసం ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌లో చేపడుతున్న ఆందోళనలో ప్రతి ఒక్కరూ పాల్గొని డిమాండ్ల పరిష్కారానికి పాటుపడాలన్నారు. దశాబ్దాల కాలంగా వెట్టి చాకిరి చేస్తున్న ఇప్పటికి ఒక్కొక్కరికీ నెలకు రూ. 1623 నుంచి రూ.4 వేలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పేస్కేల్ జీవో విడుదల చేసినప్పటికీ ఆచరణలోకి రాకపోవడంతో నిరుపేదలైన స్వీపర్ల కుటుంబాలు గడవడంలేదని వాపోయారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన కరపత్రాలను స్వీపర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన స్వీపర్లు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న స్వీపర్లు

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

మానవపాడు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు గురువారం న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రిజ్వానా మాట్లాడుతూ..ప్రభుత్వం అందిస్తున్న కిట్ల ద్వారా గర్భిణులకు పోషకాలు అందుతాయన్నారు. న్యూట్రిషన్ ఆహారం తీసుకోవడంతో తల్లిబిడ్డకు బలవర్ధకమైన ఆహారం అందుతుందన్నారు. ఈ సందర్భంగా 80మంది గర్భిణులకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అలంపూర రూరల్: మండల పరిధిలోని 102 వాహనం ద్వారా గర్భిణులకు గ్రామాల్లోని తమ ఇంటి నుంచి క్యాతూర్ పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేసి తిరిగి అదే వాహనంలో వారి వారి గమ్యస్థానాలకు చేర్చారు. క్యాతూర్ పీహెచ్‌సీలో మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూణ రాణి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు.



గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ అందజేత

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

మండల పరిధిలోని గురువారం 16మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూణరాణి, హెల్త్ అసిస్టెంట్ బాలీశ్వరయ్య తెలిపారు. వైద్యాధికారి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

అయిజ: గద్వాలలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సంధ్యారాణి అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని, బాధిత కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అయిజ పట్టణానికి చెందిన గురుకుల విద్యార్థిని సంధ్యారాణి తల్లిదండ్రులు లాజర్, సుమతి గురువారం కర్నూలులో ఎమ్మెల్యే నివాసంలో ఆయనని కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఉన్నతా ధికారులతో మాట్లాడి నగదు సాయం అందజేయాలని, మృతురాలి తల్లికి ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ప్రజా సంఘాల నాయకులు ఆంజనేయులు, చంద్రశేఖర్, రాజేంద్ర, రాజు ఉన్నారు.

ప్లాస్టిక్ బియ్యమంటూ ఆందోళన..

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో గురువారం రేషన్ దుకాణం ద్వారా ప్లాస్టిక్ బియ్యం ప్రజలకు అంటగడుతున్నారంటూ గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. గ్రామంలోని రేషన్ దుకాణానికి 146 క్వింటాళ్ల రేషన్ బియ్యం రాగా, వాటిని మూడు రోజులుగా పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారులకు అందజేసిన బియ్యంలో ప్లాస్టిక్‌ను పోలిన బియ్యం గింజలు ఉండడం, వీటిని పసిగట్టిన కొందరు యువకులు గ్రామస్తులకు తెలియజేయడంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మలపల్లి రవినాయుడు గ్రామానికి చేరుకుని రేషన్ దుకాణం దగ్గర పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ బియాన్ని రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తూ ప్రభుత్వం పేదల ఆరోగ్యంతో ఆడుకుంటుందని ఆరోపించారు.



గొర్లఖాన్‌దొడ్డి రేషన్ దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన



మానవపాడు: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రాము అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకట కృష్ణారెడ్డి ప్రభుత్వ కళాశాలలో సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు విషయాలను వివరించారు. డిజిటల్‌వాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు బలికావొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే సాధ్యం



రాజోళి: మండల కేంద్రంలోని పీఎస్ మొయిన్ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనలో గ్రామంలోని అందరి సహకారం ఉందని ఉపసర్పంచ్ గోపాల్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలోని పూర్వవిద్యార్థులు, దాతలు, గ్రామపెద్దల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇంచార్జ్ హనిమిరెడ్డి, గజేంద్రరెడ్డి, సురేష్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

కంది విత్తనాల పంపిణీ



అయిజ: మండంలంలోని కుర్వపల్లిలో గ్రామ సర్పంచ్ తిమ్మన్న ఆధ్వర్యంలో ఏఈఓ అరవింద్ రైతులకు కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడారు. శాస్త్రవేత్తలు నూతనంగా రూపొందించిన పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలను రైతులు పంటపొలాల్లో ఒక వైపున సాగుచేయాలని, పంటదిగుబడిని వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తిస్తారని తెలిపారు.

జెడ్పీచైర్‌పర్సన్ ఆత్మీయ పలకరింపు

కేటీదొడ్డి: మండల పరిధిలోని పాతపాలెంలోని గురువారం జెడ్పీచైర్‌పర్సన్ సరిత పెళ్లి వేడుకలకు హాజరై ఆ గ్రామంలోని ప్రజల మద్దతు కోరుతూ ఆత్మీయ పలకరింపుపై పలు విషయాలు చర్చించారు. వారితోపాటు శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు !

- ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

అలంపూర్ రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరో ఇంతవరకు అయోమయంలో ఉన్నారని కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని భీమవరంలో ఏర్పాటుచేసిన మండల సమవేశంలో ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు చేసేందేమి లేదన్నారు. బడుగుబలహీన వర్గాల పార్టీ ఒక కాంగ్రెస్సేనని అన్నారు. రాబోయె ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి గడిలపాలనకు చరమగీతం పడదామన్నారు. డీసీసీ జనరల్ సెక్రటరి భీమవరం శేఖర్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలిచారి, నాగశిరోమణి, నాయకులు రాము, గోపాల్, లక్ష్మణ్ రెడ్డి, ఆసీఫ్‌ఖాన్, కుమార్, నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

కాంగ్రెస్‌లో చేరికలు

శాంతినగర్: మండంల కేంద్రంలోని యువకులు ఆ పార్టీ అధ్యక్షుడు దస్తగిరి ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అంతేగాక ఇటిక్యాల మండలం పెద్దదిన్నె, యాక్తాపురం, షేక్‌పల్లి గ్రామాలకు చెందిన యువకులకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐకి సన్మానం

ధరూరు: నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శివానందం గౌడ్‌ను మండల నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు సన్మానించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐని శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరుశరాముడు, రాము, నర్సింహులు, ఆంజనేయులు, శివన్న, రాము, రామకృష్ణ, సంజీవులు, దరెప్ప పాల్గొన్నారు.



శివానందం గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



మల్దకల్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

అలంపూర్ : స్థానిక మున్సిపాలిటీలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తమ సమస్యలకోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో ఎనిమిదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా తమ డిమాండ్లను ప్రభుత్వ పరిష్కరించే వరకు సమ్మెకొనసాగుతుందని పేర్కొన్నారు. నాగేశ్వరమ్మ, మద్దమ్మ, మద్దిలేటి, అఖిల్, శాలన్న, నాగరాజు, మహేంద్ర, భూషన్న పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని కార్మికుల సమ్మె గురువారంతో ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు రాముడు, కిష్టన్న, గోపాల్‌లు మాట్లాడుతూ.నెల నెల జీతాలు చెల్లించడంతో పాటు పెండింగ్ బి ల్లులు చెల్లించాలన్నారు. కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం గురువారం వినూత్న రీతిలో నిరసనను తెలియజేశారు. వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వంటావార్పులతో నిరసన తెలియజేశారు. కార్మికులపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో స్పందించి సమస్యల పరిష్కారంపై దృష్టిని సారించాలని కార్మికులు కోరారు.

ధరూరు : పంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయడంతోపాటు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండల పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెను కొనసాగిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. సవారన్న, కాలప్ప, నాగరాజు, చంద్రాములు, హన్మంతు, దేవరాజు, ముంతనాగన్న పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారంతో 8వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు.. కార్డులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, యూనిఫాం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీచుపల్లి, ఆంజనేయులు, రమణ, నర్సింహ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో ఎనిమిదో రోజుకు చేరింది. ప్రభుత్వం జీవో నెంబర్ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు, తదితరులు ఉన్నారు.